



సర్వం సిద్ధం

- నేడు, రేపు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



బోనాల జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

రాంగోపాల్‌పేట్: తెలంగాణాలోనే ఎంతో ప్రసిద్ధి చెందిన సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతరకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 21వ తేదీ (ఆదివారం) బోనాలు, 22వ తేదీ (సోమవారం) రంగం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ శాఖల అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

◆ సర్వాంగ సుందరంగా దేవాలయం

బోనాల జాతర సందర్భంగా మహంకాళి దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవాలయాన్ని రంగులు, విద్యుత్ దీపాలు, పూలు, పండ్లతో సర్వాంగ ముస్తాబు చేశారు.

◆ ఉదయం 3.30 గంటలకు తొలిపూజ

ఆదివారం ఉదయం 3.30 గంటలకు అమ్మవారికి తొలి పూజ నిర్వహించనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా తొలిపూజ, హారతిలో పాల్గొంటారు. అనంతరం సాధారణ భక్తులు దర్శనం చేసుకునేందుకు అనుమతిస్తారు. ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి రేంవత్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకోనున్నారు. అమ్మవారికి ఆయన పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

◆ ప్రత్యేక క్యూ లైన్లు

బోనాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 6 క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా రెండు క్యూ లైన్లు బోనాలతో వచ్చే వారి కోసం ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటి పాత రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్, మరొకటి బాటా వైపు నుంచి ఉన్నాయి. పాత రాంగోపాల్‌పేట్ వైపు ఒకటి సాదారణ భక్తులకు, టొబాకో బజార్ నుంచి దాతల కోసం, అంజలీ థియేటర్ నుంచి వీఐపీ పాస్‌లతో వచ్చే వారికి ఒకటి, సాదారణ భక్తులు కోసం మరో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వీవీఐపీలు మాత్రం దేవాలయ ఆర్చ్ గేటు నుంచి నేరుగా లోపలికి వస్తారు. అత్యవసర సర్వీసుల కోసం దేవాలయం వెనుక వైపు అద్దాల మంటపంలోకి మరో క్యూ లైన్ ఏర్పాటు చేశారు.

వేడుకలకు రావాలని డిప్యూటీ మేయర్‌కు ఆహ్వానం



లాలాపేట: ఆదివారం జరిగే సికింద్రాబాద్ మహంకాళి లష్కర్ బోనాల వేడుకలకు రావాలనీ కోరుతూ ఆలయ అర్చక బృందం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డికి ఆహ్వానం పలికారు. శనివారం తార్నాకలోని ఆమె కార్యాలయంలో ఆలయ అర్చకులు కలిసి వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందించారు.

◆ మంచి నీళ్లు, వైద్య శిబిరాలు

జాతరలో వచ్చే భక్తుల కోసం దేవాలయం చుట్టు పక్కల మంచినీటి శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు మంచి నీరు అందించనున్నారు. 7లక్షల వాటర్ ప్యాకెట్లతో పాటు 250 ఎంఎల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేయనున్నారు. అలాగే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

◆ ఫెస్టివల్ ఆఫీసర్‌గా అన్నపూర్ణ

బోనాల జాతర కోసం ఇక్కడ ఈవోగా పనిచేసి నాచారం ఈవోగా పనిచేస్తున్న అన్నపూర్ణను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. జాతర పూర్తయ్యేంత వరకు ఈవోతో పాటు ఇతర అధికారులతో సమన్వయం చేసికుంటూ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు.

◆ పార్కింగ్ ప్రదేశాలు ఇవే

హరిహరకళాభవన్, మహెబూబ్ కాలేజ్, ఓల్డ్ జైల్, ఇస్లామియా హైస్కూల్, రాణిగంజ్ అడవయ్య చౌరస్తా, మహాత్మాగాంధీ విగ్రహం, తాజ్ త్రై స్టార్, బెల్సన్ తాజ్ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.


◆ 200 మంది పారిశుధ్య సిబ్బంది

జాతర సందర్భంగా జీహెచ్ఎంసీ అధికారులు 200 మంది పారిశుధ్య సిబ్బందిని నియమించారు. 16 మొబైల్ బస్ టాయిలెట్లతో పాటు అదనంగా 10 టాయిలెట్లను అందుబాటులో ఉంచారు.
























ఈసీజీని విశ్లేషిస్తే సరైన వైద్యం అందించవచ్చు

రాంగోపాల్‌పేట్: ఈసీజీని విశ్లేషిస్తే గుండె సంబంధిత వ్యాధులకు ఉత్తమ వైద్యం అందించవచ్చని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి డాక్టర్ హయగ్రీవరావు తెలిపారు. శనివారం కిమ్స్ ఆస్పత్రి ఆడిటోరియంలో సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు బెంగుళూరు, ఢిల్లీ, చెన్నైతో పాటు తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున డాక్టర్లు హాజరయ్యారు. అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి హఠన్మరణాలను నివారించవచ్చని చెప్పారు.

నేడు ప్రత్యేక పూజలు


సనత్‌నగర్: ఆషాఢ మాసం శుద్ధ పౌర్ణమి (గురు పూర్ణిమ) సందర్భంగా సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని శ్రీసాయిబాబా ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

సాయిబాబా ఆలయంలో..



పద్మారావునగర్: పద్మారావునగర్‌లోని శ్రీ సాయిబాబా దేవాలయంలో జరుగుతునన శ్రీ సాయి సప్తాహ ఉత్సవాల్లో శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.





దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- పథకం ప్రకారమే స్నేహితులతో కలిసి పన్నాగం
- 650 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న అదనపు డీసీపీ అశోక్

రాంగోపాల్‌పేట్: ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని అడ్డగించి 850 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకుని వెళ్లిన కేసును మార్కెట్ పోలీసులు ఛేదించారు. షాపులో పనిచేసే వ్యక్తితో కలిసి మరో నలుగురు నిందితులు ఈ దోపిడీకి పథక రచన చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 650 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 18న పాట్ మార్కెట్‌లోని శాంతినాథ్ జువెల్లరీ షాపునకు చెందిన దినేష్ 850 బంగారు ఆభరణాలను శ్రీని జువెల్లర్స్ నుంచి ద్విచక్ర వాహనంపై తెస్తుండగా దుండగులు దోపిడీకి పాల్పడిన విషయం విదితమే. అయితే ఈ కేసులో శాంతినాథ్ జువెల్లరీలో పనిచేసే రాజస్థాన్‌కు చెందిన దినేష్‌తో పాటు అదే ప్రాంతానికి చెందిన మరో నలుగురు కలిసి ఈ దోపిడీకి పథకం వేసి పోలీసులకు పట్టుబడ్డారు. మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో అదనపు డీసీపీ పగడాల అశోక్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు.

- గౌలిగూడలో పనిచేసే రాజస్థాన్‌కు చెందిన మహేందర్ లోహర్ (24), దినేష్ (18), ప్రవీణ్ కుమార్ (21), భవానిగిరి (21), ఉమేష్ (21) స్నేహితులు. రాజస్థాన్‌కు చెందిన నిందితులందరూ అల్వాల్‌లో ఉంటారు.
- దినేష్ పనిచేసే శాంతినాథ్ జువెల్లరీ షాపులో తయారు చేసిన బంగారు ఆభరణాలు తరచుగా ఇతర షాపులకు తీసుకుని వెళ్లి చూపించి తెస్తుంటారు. దినేష్ స్నేహితుడైన మహేందర్ లోహర్ దీని గురించి తెలుసుకుని ఎలాగైనా పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలు సొంతం చేసికుని పెద్ద ఎత్తున డబ్బు సంపాదించాలని పథకం పన్నారు.
- ఇందులో భాగంగా శాంతినాథ్ జువెల్లరీలో పనిచేసే దినేష్‌కు ఆశ చూపి అల్వాల్ ప్రాంతంలో ఉండే మరో ముగ్గురితో పథకం రచించారు. అందరూ కలిసి ఈ నెల 18వ తేదీన దినేష్ బంగారు ఆభరణాలతో ద్విచక్ర వాహనంపై వస్తుండగా అడ్డగించి ఎత్తుకుని వెళ్లాలని పథకం పన్నారు. దీనికి దినేష్ కూడా ఓకే అన్నాడు.
- అందులో భాగంగా 18వ తేదీ సాయంత్రం 4గంటలకు దినేష్ క్లాక్ టవర్ వద్దకు రాగానే నిందితులు అడ్డగించి బంగారు ఆభరణాల బ్యాగును లాక్కుని వెళ్లారు. ఏమీ తెలియనట్లుగా దినేష్ యజమానికి చెప్పడంతో ఆయన ఫిర్యాదు మేరకు మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసికుని దర్యాప్తు చేపట్టారు.
- దోచుకున్న నగలతో రాజస్థాన్ వెళ్లిపోవాలనుకున్న నిందితులు మార్గ మధ్యలో మనసు మార్చుకుని విజయవాడకు వెళ్లి అక్కడ కొన్ని నగలను విక్రయించి తిరిగి హైదరాబాద్ వచ్చారు.
- శనివారం నిందితులు అల్వాల్‌లో ఉండగా మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 650 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే



సనత్‌నగర్: పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. హమాలీబస్తీకి చెందిన రేణుక తనకు దుండిగల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లును కేటాయిస్తూ అధికారులు సర్టిఫికెట్ అందజేయగా, శనివారం తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని నివాసం కలిసి తన ఆనందాన్ని వ్యక్తంచేసింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి పేదలకు ఉచితంగా ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు.



నేడు అమ్మవారి ఘట స్థాపన సామూహిక ఊరేగింపు

చార్మినార్: పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు ఆదివారం కన్నుల పండువగా జరగనుంది. ఈ మేరకు భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆషాఢమాసం బోనాల జాతరలో భాగంగా ప్రతి ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో నిర్వహించే బోనాల సమర్పణ రోజే.. పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శాలిబండలోని కాశీవిశ్వనాథ ఆలయం నుంచి సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఘటస్థాపన ఊరేగింపులో పాల్గొనే అమ్మవారి ఘటాలు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా ఆయా ఆలయాలకు చేరుకుంటాయి.


అమ్మవారి ఘటానికి పూలతో స్వాగతం

సీడీపీవో పరీక్ష రద్దుపై నిరుద్యోగుల ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగ నియామక పత్రాలు అందచేసే సమయానికి సీడీపీవో (చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్) పరీక్షను రద్దు చేయడం పట్ల అభ్యర్థులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీ పేరుతో పరీక్షను రద్దు చేసి ఉద్యోగాలకు ఎంపికై న అభ్యర్థులకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేయాలని వడ్లకొండ దివ్య, శిరీష, ప్రసన్న, గీత, రేణుక, అలేఖ్య, ప్రశాంతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

'అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు కళాశాలలు'

ఉస్మానియా యూనివర్సిటీ: అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలపై విద్యార్థి నాయకులు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేనకు శనివారం ఫిర్యాదు చేశారు. రూ.16 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు అధిక ఫీజులు, ఇతర బ్రాంచ్‌లను విస్మరించి కేవలం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(సీఎస్ఈ) కోర్సు సెక్షన్లను పెంచడం, అటానమస్ పేరుతో ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ ఫీజులు, హాస్టల్ వసతికి విద్యార్థుల నుంచి రూ.2 లక్షలు దండుకుంటున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటు కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి నేతలు డిమాండ్ చేశారు. ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆజాద్, చిరంజీవి యాదవ్, రవినాయక్, యాదగిరి పాల్గొన్నారు.


సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేనకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి నేతలు

కేంద్రమంత్రి పరామర్శ


సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి శనివారం పద్మారావునగర్ స్కందగిరి నివాసి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. దైవదర్శనం కోసం ఉత్తరాఖండ్ వెళ్లిన సత్యనారాయణ కొండచరియలు విరిగిపడటంతో మరణించారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సత్యనారాయణ కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



పిల్లల కోసం సమయం వెచ్చించండి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు ఐరీన్ సుప్రభ

రసూల్‌పురా: తల్లిదండ్రులు తమ పిల్లలతో రోజులో కొంత సమయం వెచ్చించి వారితో గడపాలని మడ్‌ఫోర్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐరీన్ సుప్రభ సూచించారు. శనివారం హెచ్‌ఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించి వారిని సరైన మార్గంలో పెట్టాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, సురేష్, శ్రీనివాస్, భాస్కర్, శ్రీలత, శ్రీదేవి, బ్యూలా, పద్మ, శిల్ప ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత

అడ్డగుట్ట: నిరుపేద విద్యార్థిని చదువుకునేందుకు తమవంతు సహాయంగా ఒక ఏడాది ఫీజు చెల్లించారు అడ్డగుట్టకు చెందిన నవ్ యుగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు. అసోసియేషన్‌కు చెందిన ప్రహ్లాద్ అనే యువకుడు ఇటీవల మరణించాడు. శనివారం అతని పుట్టినరోజు సందర్భంగా ప్రహ్లాద్ జ్ఞాపకార్థం అడ్డగుట్ట డివిజన్‌లోని నిరుపేద కుటంబానికి చెందిన దేవి అనే యూకేజీ విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేసి తుకారాం గేట్‌లోని శ్రీ సాయి విద్యార్థి స్కూల్‌లో చేర్పించారు.


నిరుపేద విద్యార్థినిని స్కూలులో చేర్పిస్తున్న నవ్ యుగ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు

ఆర్టీసీ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటిన పొన్నం



లాలాపేట: రవాణా, బీసీ శాఖా మంత్రి పొన్నం ప్రభాకార్ శనివారం తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఇక్కడ సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఫిజియోథెరపీ యూనిట్, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌తో పాటు 24 గంటల పాటు పని చేసే ఫార్మసీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ సజ్జనార్, హాస్పిటల్ సూపరెండెంట్ డాక్టర్ శైలజా మూర్తి, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.12 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని పార్కుల్లో రూ.12 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. జీహెచ్ఎంసీ ఏఈ కౌషిక్‌తో కలిసి డివిజన్‌లోని మేడిబావి పార్కును శనివారం సందర్శించి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. మొదటివిడతలో మేడిబావి, మధురానగర్, టీఆర్‌టీ క్వార్టర్స్, మార్కండేయనగర్ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పుస్తకావిష్కరణ



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ తెలుగు శాఖ రూపొందించిన 668 పేజీల గురుతరం (తెలుగు శాఖ ఆచార్యుల సాహిత్య సేవ) పుస్తకాన్ని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి శనివారం ఆవిష్కరించారు. ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలుగు శాఖ హెడ్ ప్రొ.సాగికమలాకర శర్మ అధ్యక్షత వహించారు.

సామూహిక అక్షరాభ్యాసం



అడ్డగుట్ట: అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శనివారం తుకారాంగేట్ వెంకట్‌నగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా కేంద్రం టీచర్ అన్నపూర్ణ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాల్సిన బాధ్యత వారి తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నేతలతో సీఎం చర్చలు జరపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థి సంఘాల నాయకులతో చర్చలు జరపాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి శనివారం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రి-ప్రైమరీ తరగతుల నిర్వహించాలనే ప్రతిపాదన ప్రభుత్వ విద్యారంగానికి నష్టమని, ఎన్ఈపీని అమలు చేయవద్దని, విద్యా శాఖ మంత్రిని నియమించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రైమరీ విద్యా విధానాన్ని బలోపేతం చేసి ఇంగ్లిష్ మీడియాన్ని బోధించాలన్నారు.

